సంపుటి :02 సంచిక :79 పేజీలు :05

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

బుధవారం 07, మే 2025

ఉష్ణోగ్రతలు

కనిష్ఠం : 26

గరిష్ఠం : 37

## పేదల కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడమే టార్గెట్ గా ప్రజాప్రభుత్వం ముందుకు
- రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

05



## కళా రంగానికి తోడ్పాటు అందిస్తా

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

04




# రక్తం చిందిన కర్రెగుట్ట

- మరింత దూకుడుగా 'ఆపరేషన్ కగార్'
- గంటపాటు తుపాకుల మోత
- భారీ ఎన్‌కౌంటర్.. 26 మంది మావోయిస్టులు మృతి
- ఘటనాస్థలంలో భారీగా మారణాయుధాలు స్వాధీనం

03

భద్రతా దళాలు ఆపరేషన్ కగార్‌ను మరింత దూకుడుగా అమలు చేస్తున్నాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో తుపాకుల మోత మోగింది. కర్రెగుట్టల్లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల్లో దాదాపు 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో భద్రతా దళాలు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బలగాలు, మావోయిస్టుల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌ను సీఆర్పీఎఫ్ ఐజీ రాకేష్ అగర్వాల్ ధ్రువీకరించారు. ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. మృతి చెందిన మావోయిస్టుల వివరాలు తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి





కాళేశ్వరం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్

# కాళేశ్వరం కుంగుబాటు కథ తేలనున్నది!

- ఈ నెలలోనే కమిషన్ తుది నివేదిక
- ఎన్‌డీఎస్ఏ నివేదిక కమిషన్‌కు అందడమే తరువాయి
- 400 పేజీల నివేదిక సిద్ధం.. 90 శాతం మేర పూర్తి
- నివేదికలో ఏం ఉండబోతుందని.. సర్వత్రా ఆసక్తి

'తెలంగాణ కోటి ఎకరాల మాగాణి' అన్న నినాదంతో గత ప్రభుత్వం రూ.96 వేల కోట్ల నిధులతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. కట్టిన కొంతకాలంలోనే ప్రాజెక్ట్ పరిధిలోని మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు గురైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల ధన దాహం కారణంగానే కుంగుబాటు జరిగిందని అధికార పార్టీ దుమ్మెత్తిపోసింది. రెండు వైపులా నిందారోపణలు, ప్రతిదాడులు ఎలాగున్నా.. కుంగుబాటు వెనుక ఉన్న జరిగిన కథాకమామీషు తేల్చడానికి జస్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ రంగంలోకి దిగింది.

04

నిర్మాణం వెనుక లోతైన అధ్యయనం చేసింది. ఇప్పటికే నాటి యంత్రాంగంలో కొందరిని విచారించింది. వారి నుంచి కీలకమైన అంశాలను సేకరించింది. ఇప్పటికే 90 శాతం నివేదిక పూర్తయిందని సమాచారం. ఈ నెల చివరిలోపు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నది. ఈ నేపథ్యంలో కమిషన్ తుది నివేదికలో ఏం తేలనున్నది..? అనే అంశంపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

– అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

## క్రయవిక్రయాల రికార్డులు నిర్వహించాలి



- విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో కలెక్టర్ ప్రావిణ్య
- ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్స్, కంపెనీల ప్రతినిధులతో సమావేశం

04

## చేతి కందిన పంట అగ్గి పాలు

- లబోదిబోమంటున్న రైతు కుటుంబం
- ఆదుకోవాలని అధికారులకు వేడుకోలు

04












# హైదరాబాద్ లో అందగత్తెల తళుకులు !

- అందాల పోటీలకు ముస్తాబైన భాగ్యనగరి!
- హైదరాబాద్ లో 'మిస్ వరల్డ్' పోటీలు షురూ
- 116 దేశాలకు చెందిన 'బ్యూటీస్' ప్రాతినిథ్యం
- తెలంగాణ ఆతిథ్యాన్ని స్వీకరించనున్న కంటెస్టెంట్లు

అక్షర దర్బార్, ప్రధానప్రతినిధి: అందాల పోటీలకు భాగ్యనగరం ముస్తాబైంది. దేశ విదేశాలకు చెందిన అందగత్తెలు ఇప్పటికే భాగ్యనగరం చేరుకున్నారు. మొత్తం 116 దేశాల నుంచి అందాల తారలు పోటీల్లో పాల్గొననున్నారు. ఈ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండేలా రాష్ట్రప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఏర్పాట్లను రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యవేక్షిస్తున్నారు. మే 10న హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సాయంత్రం 5 గంటలకు మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే వివిధ దేశాలకు నుంచి మిస్ వరల్డ్ 2025లో పాల్గొనే సుందరీమణులు తెలంగాణకు చేరుకుంటున్నారు. 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటారు. తెలంగాణ సంప్రదాయం, సంస్కృతి ఉట్టిపడే వేదికగా గచ్చిబౌలి స్టేడియంలో వేడుక ప్రారంభమవుతుంది. పోటీలకు సంబంధించిన షెడ్యూలు ఇప్పటికే విడుదలైంది.

### బౌద్ధ ఆధ్యాత్మిక యాత్ర:

మే 12: నాగార్జునసాగర్, బుద్ధవనాన్ని ఆసియాకు చెందిన 28 మంది మిస్ వరల్డ్ 2025 టీమ్ బౌద్ధ థీమ్ పార్క్ సందర్శిస్తారు.

**హైదరాబాద్ హెరిటేజ్ వాక్:**

మే 13: చార్మినార్, లాడ్‌బజార్‌లో మిస్ వరల్డ్‌లో పాల్గొనే 116 మంది హైదరాబాద్ ను సందర్శిస్తారు.

**వెల్‌కమ్ డిన్నర్:**

మే 13: చౌమహల్లా ప్యాలెస్‌లో సాయంత్రం 6 గంటలకు సందర్శనతో పాటు మ్యూజికల్ కన్సర్ట్‌తో విందు

**వరంగల్ హెరిటేజ్ టూర్:**

మే 14: సాయంత్రం 5 గంటలకు ప్రారంభం అవుతుంది. వేయిస్తంభాల గుడి, వరంగల్ కోటను అమెరికాకు చెందిన 22 మంది పోటీదారులు సందర్శిస్తారు.

**రామప్ప టెంపుల్ టూర్:**

మే 14: సాయంత్రం 4:30 కార్యక్రమం ఉంటుంది. ఆలయాన్ని యూరప్ దేశాలకు చెందిన 35 మంది పోటీదారులు సందర్శిస్తారు. పేరిణి నృత్య ప్రదర్శన

**యాదగిరిగుట్ట టెంపుల్ టూర్:**

మే 15: సాయంత్రం 5 గంటలకు యాదగిరిగుట్టలో నుంచి కరేబియన్ దేశాలకు చెందిన 10 మంది ఈ ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొంటారు.

**హ్యాండ్లూమ్ ఎక్స్‌పెరెన్షియల్ టూర్ :**

మే 15: సాయంత్రం 6 గంటలకు, పోచంపల్లిలో కార్యక్రమం. ఆఫ్రికా దేశాలకు చెందిన 25 మంది తెలంగాణ చేనేత వస్త్రు పరిశ్రమను సందర్శిస్తారు.

**మెడికల్ టూరిజం:**

మే 16: హైదరాబాద్ లోని పలు ఆస్పత్రులను మిస్ వరల్ట్ పోటీదారులు సందర్శిస్తారు. తెలంగాణలో మెడికల్ టూరిజాన్ని తెలుసుకుంటారు.

**పిల్లలమర్రి సందర్శన :**

మే 16: పిల్లలమర్రి మహబూబ్‌నగర్‌లో. అమెరికా గ్రూప్‌నకు చెందిన పోటీదారులు పిల్లలమర్రి చెట్టును సందర్శిస్తారు.

**ఎకో టూర్ పార్క్:**

మే 16: ఆసియాకు చెందిన 24 మంది పోటీదారులు ఎక్స్‌పీరియం ఎకో టూరిజం పార్క్ ను సందర్శిస్తారు.

**స్పోర్ట్స్ ఫినాలే:**

మే 17: గచ్చిబౌలి స్టేడియంలో పోటీదారులు స్పోర్ట్స్ ఫైనల్స్‌లో పాలుపంచుకుంటారు.

**రామోజీ ఫిల్మ్‌సిటీ టూర్:**

మే 17: రామోజీ ఫిల్మ్ సిటీని పోటీదారులు సందర్శిస్తారు.

**సేఫ్టీ టూరిజం:**

మే 18: హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

**బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ విజిట్ తెలంగాణ రైజింగ్ విజన్:**

మే 18: సాయంత్రం సెక్రటేరియట్‌ను, ట్యాంక్‌బండ్‌ను పోటీదారులు సందర్శిస్తారు. నెక్లెస్ రోడ్డులో సండే ఫన్ డే కార్నివాల్ నిర్వహిస్తారు.

**కాంటినెంటల్ ఫైనల్:**

మే 20, మే 21: ఖండాల వారీగా పోటీదారుల ఫాస్ట్-ట్రాక్ సెలెక్షన్స్

**ఐపీఎల్ సెమీఫైనల్స్ :**

మే 20 లేదా 21: ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్‌ను క్రికెట్ ఆడే దేశాలకు చెందిన 20 మంది పోటీదారులు తిలకిస్తారు.

**ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్**




మే 21: సాయంత్రం యూరప్‌కు చెందిన 35 మంది శిల్పారామంలో తెలంగాణ డ్వాక్రా బజార్ స్టాళ్లను సందర్శిస్తారు.

**మిస్ వరల్డ్ టాలెంట్ ఫైనల్:**

మే 22: శిల్పకళా వేదికలో 116 మంది పోటీదారులు వివిధ కళల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారు.

**హెడ్ -టు -హెడ్ ఛాలెంజ్:**

మే 23: ట్రైడెంట్ హోటల్‌లో మిస్ వరల్ట్ ఛాలెంజ్‌లో అందాల తారలు పాల్గొంటారు.

**మిస్ వరల్డ్ టాప్ మోడల్, ఫ్యాషన్ ఫైనల్:**

మే 24: సాయంత్రం ట్రైడెంట్/హైటెక్స్ లో సుందరీమణులందరూ ఫ్యాషన్, జ్యువెల్లరీ షోలో పాల్గొంటారు.

**బ్యూటీ విత్ పర్పస్.. డిన్నర్:**

మే 24: హైటెక్స్ లో అందాల తారలంతా విందులో పాల్గొంటారు.

**మిస్ వరల్డ్ గ్రాండ్ ఫైనల్:**

మే 31: సాయంత్రం 5:30 గంటలకు రెడ్ కార్పెట్ ఈవెంట్












# ప్రవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు**

అక్షర దర్బార్, తొర్రూరు : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు డిమాండ్ చేశారు. బుధవారం తొర్రూరు మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎండల తీవ్రత దృష్ట్యా సెలవులు ఇస్తే కొన్ని ప్రవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ స్పందించి వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండ్ల రాకేష్, తొర్రూరు మండల ఉపాధ్యక్షులు మహేష్, మండల నాయకులు సందీప్, వినోద్, ప్రవీణ్, మహేష్, త్రిష తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి



అక్షర దర్బార్, కేసముద్రం : వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం నాడు ఇనుగుర్తి మండలంలో చోటు చేసుకుంది.గ్రామస్తుల కథనం ప్రకారం...ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన మాంకాల వెంకటనర్సు (55) అనే వ్యక్తి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.పనికోసం హైదరాబాద్ వెల్లి తిరిగి కోమటిపల్లిలోని తన ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో వడదెబ్బ తగిలి ఒక్కసారిగా తన ఇంట్లో కుప్పకూలిపోయాడు.గమనించిన కుటుంబ సభ్యులు మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.





# ఈత.. జాగ్రత్త

- ఉత్సాహం మాటున పెను ప్రమాదం
- క్షణాల్లో ముగుస్తున్న విలువైన జీవితాలు
- పిల్లల్లో అవగాహన పెంచితే మేలు

అక్షర దర్బార్, తొర్రూరు : అసలే వేసవి కాలం... అందులోనూ సెలవులు. చాలా మంది పిల్లలు సరదాగా ఆడుకోవడం కోసం బావులు, చెరువులు, కుంటల వద్దకు వెళ్తుంటారు. అయితే ఈ సరదానే వారి ప్రాణాలను బలి తీసుకుంటోంది. సెలవులు పిల్లలకు ఆట విడుపుగా మారాయి. గ్రామాల్లో చాలా వరకు యువత, పిల్లలు బావులు, చెరువుల్లో ఈతకు వెళ్తుంటారు. కొత్తగా ఈత నేర్చుకోవాలన్నా.. ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చెరువుల్లో ఈత కొట్టాలన్నా ఉత్సాహం ఉన్న పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నీటిలోకి దిగితే ప్రమాదాల బారిన పడే అవకాశం పొంచి ఉంది. వీరికి చెరువుల్లో నీళ్ల లోతు, ఈత కొట్టడంపై పెద్దగా అవగాహన ఉండదు. ఇలాంటి వారే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతుంటారు.

## జాగ్రత్తలు తీసుకోవాలి

ఈత రాని పిల్లలు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా... నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. కావున తల్లిదండ్రులు పిల్లలను కనిపెడుతూ ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో ఈతకు వెళ్ళాలనుకుంటే వారి వెంట ఈత వచ్చిన పెద్దలు తప్పకుండా వెళ్ళాలని నిపుణులు చెబుతున్నారు. పిల్లల సరదా కుటుంబాల్లో విషాదం నింపకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలకు ఈత నేర్పించే సమయంలో నీటిలో మునిగిపోకుండా కాపాడే లైఫ్ జాకెట్లను వినియోగించాలి. చెరువులు, కుంటలు, బావుల లోతు ఎంత ఉందో ముందుగానే తెలుసుకోవాలి. ఈత రాని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లల్లోకి దిగవద్దు.

## పిల్లలను ఈతకు ఒంటరిగా పంపించొద్దు

ఎస్సై ఉపేందర్, తొర్రూరు



వేసవి సెలవుల దృష్ట్యా పిల్లల పట్ల తలిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఒంటరిగా చెరువులు, కుంటల వద్దకు పంపించొద్దు. ఈత రాని వారు నీళ్లలోకి దిగొద్దు. పిల్లల వెంట తప్పకుండా పెద్దలు వెళ్ళాలి.




# ఇందిరమ్మ పాలన పేద ప్రజలకు అండ

**కాంగ్రెస్ నేత బాణాల ప్రసన్న శ్రీనివాస్**

అక్షర దర్బార్, నర్సంపేట : పేద ప్రజలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వం నిలబడుతుందని కాంగ్రెస్ నాయకుడు బాణాల ప్రసన్నశ్రీనివాస్ అన్నారు. బుధవారం నర్సంపేట 16వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి బాణాల ప్రసన్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గండి గిరి చేతులమీదుగా కోట రాజుగారికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేరు. కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సారంగం, 21 వార్డు కొంకిసా కిరణ్ గౌడ్, నర్సంపేట పట్టణ 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు బరిగేల సురేష్, పోగుల ప్రవీణ్, అనపర్తి సతీష్, మడికొండ రంజిత్, రసమల్ల మహేందర్, తోట యాకయ్య, సోమారపు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన..


అక్షర దర్బార్, మరిపెడ : శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవం మరిపెడ లో ఘనంగా జరిగింది. వేద పండితులు నందిగామ జనార్ధన చార్యులు ఆద్వర్యంలో గణపతి పూజ, పుణ్యహవచనం, బ్రహ్మం గారి ఆరాధన మహోత్సవం చేశారు. కలియుగంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కాల జ్ఞానం ప్రసిద్ధి చెందింది అన్నారు. కార్యక్రమంలో దాసరోజు రమేష్ చారి, అనుమూల సుధాకర్ చారి, యాదల పురం వెంకటేస్వర చారి, కురవి మధు, బాలకృష్ణ చారి,వేణు, సింహాద్రి రామానుజ చారి, పుల్లయ్య, నాగేంద్ర చారి, ముది రెడ్డి లక్ష్మ రెడ్డి, వెర్మరెడ్డి వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రక్తం చిందిన కర్రెగుట్ట

- మరింత దూకుడుగా 'ఆపరేషన్ కగార్'
- గంటపాటు తుపాకుల మోత
- భారీ ఎన్‌కౌంటర్.. 26 మంది మావోయిస్టులు మృతి
- ఘటనాస్థలంలో భారీగా మారణాయుధాలు స్వాధీనం

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: భద్రతా దళాలు ఆపరేషన్ కగార్‌ను మరింత దూకుడుగా అమలు చేస్తున్నాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో తుపాకుల మోత మోగింది. కర్రెగుట్టల్లో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. కాల్పుల్లో దాదాపు 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో భద్రతా దళాలు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బలగాలు, మావోయిస్టుల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నందున మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఎన్‌కౌంటర్‌ను సీఆర్పీఎఫ్ ఐజీ



రాకేష్ అగర్వాల్ ధ్రువీకరించారు. ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. మృతి చెందిన మావోయిస్టుల వివరాలు తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## 20 రోజులుగా ఆపరేషన్..

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో 'ఆపరేషన్ కగార్'లో విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. మావోయిస్టుల కోసం గత 20 రోజులుగా కర్రెగుట్టల ప్రాంతంలో విస్తృతంగా గాలిస్తున్న భద్రతా బలగాలకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఆపరేషన్లో భాగంగా ఐదు బేస్ క్యాంపులు ఏర్పాటు చేసి 10 వేల మందికి పైగా జవాన్లు అడవులను జల్లెడ పడుతున్నారు. మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో సాగుతున్న ఈ ఆపరేషన్లో.. 204 కోబ్రా బెటాలియన్కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్ సాగర్ బొరడే ప్రమాదవశాత్తు మరణించాడు. అడవిలో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్మైన్పై ఆయన కాలు మోపడంతో భారీ పేలుడు సంభవించింది. తీవ్రంగా గాయపడిన సాగర్ను వెంటనే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ.. మార్గ మధ్యలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన 'ఆపరేషన్ కగార్'లో పాల్గొంటున్న భద్రతా దళాలకు తీరని నష్టాన్ని కలిగించింది. జరిగిన ఘటనపై అధికారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కర్రె గుట్టల ప్రాంతంలో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు సమాచారం అందడంతో.. వారిని నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర బలగాలు 'ఆపరేషన్ కగార్'ను కొనసాగిస్తున్నాయి. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, మావోయిస్టులు వ్యూహాత్మకంగా అమర్చిన మందుపాతరలు భద్రతా దళాలకు పెద్ద సవాలుగా మారాయి. అయినప్పటికీ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ప్రత్యేకంగా శిక్షణ పొందిన K9 (డాగ్ స్క్వాడ్), K3 బృందాల సహాయంతో కూంబింగ్ ఆపరేషన్ను మరింత వేగవంతం చేస్తోంది. ఇప్పటికే పలువురు నక్సల్స్ మృతి చెందగా.. వారిని మట్టుబెట్టడమే లక్ష్యంగా కూబింగ్ కొనసాగిస్తున్నారు.

# చేతి కందిన పంట అగ్గిపాలు

- బోరున విలపించిన బాధిత కుటుంబం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

అక్షర దర్బార్,చిట్యాల : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే సమయంలోనే అగ్గిపాలు కావడంతో ఆ రైతు కుటుంబం బోరుమంది. వివరాల్లోకి వెళ్తే.. చిట్యాల మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన కత్తుల ఓదెలు తనకున్న రెండెకరాల పొలంలో మొక్కజొన్న పంట వేశాడు. ఈ క్రమంలో చేతికి వచ్చిన పంట బుధవారం అగ్నికి ఆహుతి అయింది. కళ్ల ఎదుటే పంట మొత్తం కాలి పోతుంటే ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో రైతు బోరున విలపించాడు. సుమారు మూడు లక్షల మేర ఆస్తి నష్టం జరగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఓదేలు కోరారు.





# 'కాళేశ్వరం' కుంగుబాటు కథ తేలనున్నది

- ఈ నెలలోనే కమిషన్ తుది నివేదిక
- ఎన్డీఎస్ఏ నివేదిక కమిషన్ కు అందడమే తరువాయి
- 400 పేజీల నివేదిక సిద్ధం.. 90 శాతం మేర పూర్తి
- నివేదికలో ఏం ఉండబోతుందని.. సర్వత్రా ఆసక్తి



'తెలంగాణ కోటి ఎకరాల మాగాణి' అన్న నినాదంతో గత ప్రభుత్వం 96 వేల కోట్ల నిధులతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. కట్టిన కొంతకాలంలోనే ప్రాజెక్ట్ పరిధిలోని మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు గురైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల ధన దాహం కారణంగానే కుంగుబాటు జరిగిందని అధికార పార్టీ దుమ్మెత్తిపోసింది. రెండు వైపులా నిందారోపణలు, ప్రతిదాడులు ఎలాగున్నా.. కుంగుబాటు వెనుక ఉన్న జరిగిన కథాకమామీషు తేల్చడానికి జస్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ రంగంలోకి దిగింది. నిర్మాణం వెనుక లోతైన అధ్యయనం చేసింది. ఇప్పటికే నాటి యంత్రాంగంలో కొందరిని విచారించింది. వారి నుంచి కీలకమైన అంశాలను సేకరించింది. ఇప్పటికే 90 శాతం నివేదిక పూర్తయిందని సమాచారం. ఈ నెల చివరిలోపు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నది. ఈ నేపథ్యంలో కమిషన్ తుది నివేదికలో ఏం తేలనున్నది..? అనే అంశంపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి :**

కాళేశ్వరం పరిధిలోని మేడిగడ్డ కుంగుబాటుకు గల కారణాలపై ఈ నెల రెండో వారంలో లేదా కాస్త అటు ఇటుగా స్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నది. అందుకు సంబంధించి దాదాపుగా కసరత్తు కమిషన్ పూర్తి చేసింది. ఇక ఎన్డీఎస్ఏ తుది నివేదిక వస్తే దాని ప్రకారం కమిషన్ తన చివరి నివేదికను పూర్తి చేయనున్నది. కాగా.. కాళేశ్వరం కమిషన్ విచారణ గురువారం నుంచి తిరిగి ప్రారంభమైంది. ఈసారి బహిరంగ కోర్టు ద్వారా ఎవర్ని విచారణకు పిలువకపోయినా, నివేదికను సిద్ధం చేసే కసరత్తు చురుగ్గా జరుగుతోందని సమాచారం. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం బరాజ్‌ల నిర్మాణాల అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ పినాకీ చంద్రఘోష్ కమిషన్ ఇప్పటికే ఐఏఎస్, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులను ప్రశ్నించింది. వీటితో పాటు ప్రభుత్వం, వివిధ ఏజెన్సీల నుంచి తీసుకున్న పత్రాల ఆధారంగా 400 పేజీల నివేదికను సిద్ధం చేసినట్టు సమాచారం.

## - తుది నివేదిక కోసం ఎన్డీఎస్ఏకు లేఖ

ఇప్పటికే దాదాపు 90 శాతం రిపోర్టును పూర్తిచేసినట్టు తెలుస్తోంది. ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఇంకా అందని నేపథ్యంలో ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత పూర్తిస్థాయి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందించేందుకు కమిషన్ సిద్ధమవుతుందని తెలుస్తోంది. అందుకే ఇప్పటికే ఎన్డీఎస్ఏ తుది నివేదిక కోసం కమిషన్ మరోసారి లేఖ రాసింది. ఆ నివేదిక ఈ నెలాఖరుకు కానీ లేదా మే మొదటివారంలో గానీ వచ్చే అవకాశం ఉందని, నివేదిక అందిన తర్వాత కమిషన్, సర్కార్‌కు తుది నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం. కాగా గతేడాది మార్చి 12న ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అందించడంలో ఇప్పటికే ఆలస్యమైందని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటివరకు పలుమార్లు కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో మరో రెండు నెలల వరకు పొడిగించే అవకాశం కనిపిస్తోంది. అయితే చివరి దఫా విచారణలో కీలకమైన మాజీ సీఎం కేసీఆర్ సహా మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను సైతం విచారణకు పిలుస్తారని తెలుస్తోంది. కానీ ఎప్పుడనేది ఇంకా వెల్లడి కాలేదు.

## - మంత్రి ఉత్తమ్ పవర్ ప్రజంటేషన్..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్నారం, సుందిళ్ల బరాజ్ల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లపై ఇటీవల రాష్ట్ర ఇరిగేషన్శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి యంత్రాంగానికి మీడియా ముఖంగా పవర్ ప్రజంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు తమ ప్రభుత్వం ముున్ముందు ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశంపై స్పష్టతనిచ్చారు.

### కాళేశ్వరం కుంగుబాటు వెనుక...

ఆ తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయట పడ్డాయి. బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వాటి పరిష్కారాలపై గతేడాది మార్చిలో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్డీఎస్ఏ) నియవి ఉంచిన నిపుణుల కమిటీ. సుదీర్ఘ విరామం తర్వాత ఇటీవలే నివేదిక సమర్పించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సమగ్ర పరిశోధనలు చేసి, వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఎన్డీఎసీ తేల్చి చెప్పింది. ఈ మూడు బ్యారేజీల నిర్మాణంలో వైఫల్యాలు ఉన్నాయని పేర్కొంది. బ్యారేజీల డిజైన్ల రూపకల్పనలో లోపాలు, తగిన పరిశోధనలు చేపట్టకుండానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాలు మార్చారని వెల్లడించింది. 2019లో బ్యారేజీల నిర్మాణం పూర్తయితే.. మేడిగడ్డ బ్యారేజీ ఏడో పిల్లర్ (2023 అక్టోబర్ 21) కుంగే వరకూ దానిపై ఎటువంటి ఆపరేష సైన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనులు చేయలేదని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసింది. ఈ బ్యారేజీల నిర్మాణానికి వినియోగించే సిమెంట్, స్టీల్, ఇతరత్రా సామగ్రిని పరీక్షించకుండానే వినియోగించారని ఆ నివేదిక సారాంశం.

# క్రయవిక్రయాల రికార్డులు నిర్వహించాలి



- విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో కలెక్టర్ ప్రావిణ్య
- ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సీడ్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్స్, కంపెనీల ప్రతినిధులతో సమావేశం

అక్షరదర్బార్, హనుమకొండ: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు నివారణ మందుల అమ్మకాల్లో వరంగల్ జిల్లాకు మంచి పేరు ఉందని, ఇదే విధానంలో విత్తన, ఎరువులు, పెస్టిసైడ్స్ డీలర్లు ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సీడ్, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్ డీలర్స్, వివిధ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సీడ్స్, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ విక్రయాలకు సంబంధించి వరంగల్ కు ఒక నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని కొనసాగించాలని అన్నారు. చుట్టుపక్కల జిల్లాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చి తీసుకెళ్తుంటారని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన దానికి బిల్లులు తప్పనిసరిగా డీలర్లు ఇవ్వాలన్నారు. డీలర్లు తమ దుకాణాల ద్వారా చేపట్టే విత్తన, ఎరువులు, పురుగు మందుల క్రయవిక్రయాలకు సంబంధించి రికార్డుల నిర్వహణ ఎప్పటికప్పుడు చేయాలన్నారు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులను చూపించాల్సి ఉంటుందన్నారు. నకిలీ విత్తన, ఎరువులు, పురుగు మందుల గురించి ఏదైనా సమాచారం వస్తే వెంటనే టాస్క్ ఫోర్స్ కమిటీ అధికారులకు అందించాలన్నారు. ఒక్క రైతుకు కూడా నష్టం రావొద్దన్నారు. సీజన్ లో ఎక్కడ కూడా విత్తన ఎరువులు, పురుగు మందులకు కొరత, ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని డీలర్లకు చెప్పారు. పలువురు డీలర్లకు ఇ-పాస్ మిషన్లను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, సతీష్ బాబు, ఇతర అధికారులు, సీడ్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్లు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లను వేగంగా పూర్తి చేయాలి

**అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి**

అక్షర దర్బార్, దుగ్గొండి: ఇందిర ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం దుగ్గొండి మండలంలోని రేకంపల్లి గ్రామంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి మండల అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని, పూర్తి చేస్తేనే బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రా రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లెక్కల అరుంధతి, మండల పంచాయతీ అధికారి శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి

అక్షర దర్బార్ మొగుళ్లపల్లి: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు బుధవారం మొగుళ్ళ పల్లి మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బెజగం నాగరాజు, ఉపాధ్యక్షుడు బజ్జూరి వీరన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పురోహితులు వెంకటేశ్వర చార్యుల ఆధ్వర్యంలో వాసవి మాతకు ప్రత్యేక కుంకుమ పూజలు మహా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు బజ్జూరి రాఘవులు, బజ్జూరి శ్రీనివాస్, కోశాధికారి బజ్జురి వేణు, యూత్ కమిటీ అధ్యక్షులు పులి సాయి, ఆర్యవైశ్య సంఘం మండల మహిళా అధ్యక్షురాలు బజ్జూరి భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షురాలు గౌరిశెట్టి మంజుశ్రీ , మాజీ అధ్యక్షులు శ్రీనివాస్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు,



పూజలు చేస్తున్న మహిళా భక్తులు

# ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

*** తల్లిదండ్రులకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచన**


అక్షరదర్బార్, హనుమకొండ: ప్రతిభ ఉన్న పిల్లలను వారి తల్లిదండ్రులు ప్రోత్సహించి పిల్లల అభ్యున్నతికి కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇండియా బుక్ అఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించుకున్న ఎస్ఐ కుమారుడిని వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం అభినందించారు. హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తున్న దామెరుప్పుల దేవేందర్ తనయుడు మాస్టర్ దామెరుప్పుల అక్షిత్ రవీంద్ర ఠాగూర్ వ్రాసిన 'వేర్ ది మైండ్ ఈజ్ విట్‌అవుట్ ఫీయర్' రచనను ఏడు భాషలైన తెలుగు, కన్నడ, హిందీ, బెంగాలి, మరాఠీతో పాటు ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో మూడు నిమిషాల పది గడియల్లో కంఠస్థంతో అనర్గళంగా చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించాడు. ఈ సంస్థవారు ఇటీవల మాస్టర్ అక్షిత్ పేరును ఇండియా బుక్ అఫ్ రికార్డ్స్ నమోదు చేసినట్లుగా జారీ చేసిన ధృవీకరణ పత్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా మాస్టర్ అక్షిత్‌కు అందజేసారు. ఈ సందర్బంగా అక్షిత్ సాధించిన ఘనతను పోలీస్ కమిషనర్ ప్రత్యక్షంగా తిలకించి మాస్టర్ అక్షిత్‌తో పాటు తల్లిదండ్రులు దేవేందర్, స్వప్న, మెంటర్ కోమనేని రఘును పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ విధినిర్వహణ భాగంగా పోలీసులు బీజీగా ఉన్నా తమ పిల్లల అభ్యున్నతికి కొద్ది సమయాన్ని కేటాయిస్తూ తమ పిల్లలను ఉన్నత స్థానాల్లో నిలుపుతున్న పోలీస్ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.





# ధరణి పాపం గత పాలకులదే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఈ నెల 10న మంత్రి పొంగులేటి రాక..
- చిట్యాల మండలంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ




అక్షర దర్బార్,రేగొండ: గత పాలకుల పాపమే ధరణి చట్టం అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని రేగొండ, భాగిర్తి పేట గ్రామాల్లో తహసీల్దార్లు శ్వేత, సత్యనారాయణ ఆధ్వర్యంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించగా, ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడారు. గతంలో ధరణి చట్టం వల్ల విలువైన భూములు అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని తెలిపారు. గతంలో జరిగిన తప్పులను సరి చేసుకోవడం, జరిగిన తప్పులకు అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతిలో ఉంటుందన్నారు. భూ భారతి తో భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్డ్ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపులు తయారు చేసి పట్టాదారు పాసుపుస్తకాలు నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపు అవకాశం కలుగుతుందని అన్నారు. జూన్ 10న రేగొండ మండలంలో జరిగే భూ భారతి అవగాహన సదస్సుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరవుతారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పలువురు కాంగ్రెస్ నేతలు, అధికారులు, రైతులు ఉన్నారు.

### కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే మినీ క్యాంప్ కార్యాలయంలో చిట్యాల, టేకుమట్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 47 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ. 47,05,452 విలువైన చెక్కులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ఉందని అన్నారు. కార్యక్రమంలో మొకిరాల మధు వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్లో తిరుపతి నాయకులు చిలుకల రాయ కొమురు, మాజీ ఎంపీటీసీ దబ్బేట అనిల్ పాల్గొన్నారు.

# 20 వరకు కాంగ్రెస్ కమిటీలు పూర్తి

- 2017 నుంచి పార్టీ మారని వారికే ప్రాధాన్యత
- పరకాల ఎమ్మెల్యే రేవూరి, జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ




అక్షర దర్బార్, పరకాల : కాంగ్రెస్ పార్టీ నిర్మాణంతో పాటు కార్యకర్తలను కాపాడుకుంటామని, త్వరలోనే గ్రామ మండల బ్లాక్ అధ్యక్షులను పూర్తిస్థాయిలో నియమిస్తామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ రూరల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన నిర్వహించిన పరకాల నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, టీపీసీసీ అబ్జర్వర్లు మస్కుద్ అహ్మద్ అమీర్ అలీ ఖాన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, ఏఐసిసి ఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 20 నాటికి డీసీసీ అధ్యక్షులను మే నెలాఖరు వరకు గ్రామ, మండల, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియామకాలు పూర్తి చేసేందుకు జిల్లాకు ఇద్దరు పీసీసీ పరిశీలకులుగా వచ్చారని అన్నారు. 2017 నుంచి పార్టీ మారని వారికే అవకాశం కల్పించాలని అధిష్టానం సూచించినట్లు తెలిపారు.

# పేదల కల నెరవేర్చడమే లక్ష్యం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడమే టార్గెట్ గా ప్రజాప్రభుత్వం ముందుకు
- రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

అక్షరదర్బార్, నూగూరువెంకటాపురం: రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేద వాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం వాజేడు మండలం టేకుల గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నాగారం నుండి పాయబట్ల వరకు రూ.400 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రూ.150 లక్షల అంచనాతో వాజేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, ఎడ్చర్లపల్లి నుంచి ముత్తారం వరకు రూ.300 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపనలు, రూ.14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనంను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, భద్రాచలం శాసనసభ్యులు డా తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ శబరిష్ , ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొంగాల గ్రామంలో 57 మందికి, నాగారం గ్రామంలో 64 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి అందచేశారు. అనంతరం వెంకటాపురం మండలం కేంద్రంలో అంచనా విలువ రూ.60 లక్షలతో ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ (పి.ఆర్) కార్యాలయ భవన నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు చేసిన అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమాల్లో ఏఎస్పి శివం ఉపాధ్యాయ, డీఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# కళా రంగానికి తోడ్పాటు అందిస్తా



అక్షరదర్బార్, హనుమకొండ: మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తన స్వగృహంలో వరంగల్ లో ఉన్న పలువురు సాహితీవేత్తలను ఆహ్వానించి సాహిత్య కల తీరు తెన్నుల వైభవాలపై చర్చించారు. ఈ సందర్భంగా సాహితి కళా రంగానికి తోడ్పాటు అందిస్తానని, సాహిత్యంపై ఉన్న నా అభిరుచిని పలువురు సాహిత్య వేత్తలకు ప్రోత్సాహంగా ఏదైనా చేయాలని తన మనసులోని భావ ప్రకటన తెలియజేశారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు తమ తమ అభిప్రాయాలు పొన్నల లక్ష్మయ్యతో పంచుకున్నారు. విధి విధానాల గురించి చర్చించి సాహిత్య కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య వేత్తలు డాక్టర్ బన్న ఐలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, గన్నమరాజు గిరిజ మనోహర్ బాబు,పి చందా, సీనియర్ కవి వీఆర్ విద్యార్థి, మంతెన శంకర్ తదితరులు పాల్గొన్నారు


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915